శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో నాయకులు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి,ఆంజనేయగౌడ్, బాలరాజు యాదవ్ తదితరులు

యూజీసీ నిబంధనలు అప్రజాస్వామికం

- ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం
- ఎన్డీయే భాగస్వామి నితీశ్‌తో పాటు అనేక రాష్ట్రాల అభ్యంతరం
- వ్యతిరేకిస్తూ తమిళ నాడు అసెంబ్లీ తీర్మానం
- ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం విడ్డూరం
- కేటీఆర్ నేతృత్వంలో కేంద్రమంత్రులను కలుస్తాం
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని, వీసీలను నియమించే అధికారం గవర్నర్‌కు కట్టబెట్టడం విడ్డూరమని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ విమర్శించారు. డబ్బులు రాష్ట్రాలు ఖర్చుపెడితే కేంద్రం పెత్తనం చెలాయించడమేంటని మండిపడ్డారు. ఎన్డీయే భాగస్వామ్యపక్షాలతోపాటు దేశంలోని అనేక రాష్ట్రాలు ఈ ముసాయిదాపై నిరసన తెలుపుతున్నాయని పేర్కొన్నారు. ఎన్డీయే కీలక భాగస్వామి బీహార్ సీఎం నితీశ్ కుమార్‌తోపాటు కేరళ ముఖ్యమంత్రి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపడంతో పాటు సీఎం స్టాలిన్ కేంద్రం వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారని అన్నారు. కానీ ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్, ఆంజనేయగౌడ్, బాలరాజు యాదవ్, రాకేశ్‌కుమార్, వాసుదేవరెడ్డి, కురువ విజయ్‌కుమార్, బొమ్మెర రామ్మూర్తితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. ప్రస్తుత యూజీసీ నిబంధనల ప్రకారం ప్రొఫెసర్ల నియామకం సైతం కేంద్రం చేతుల్లోకి వెళ్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఈ నిబంధనలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో తీర్మానం చేయాలి

రాష్ట్రాల హక్కులను హరించే విధంగా ఉన్న యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే సీఎం చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తుందని తెలిపారు. తక్షణమే తెలంగాణ వైఖరిని తెలిపాలని సూచించారు.

భిన్నత్వంలో ఏకత్వానికి విఘాతం: దాసోజు

యూజీసీ నిబంధనలు భిన్నత్వంలో ఏకత్వం అనే సూత్రాన్ని విస్మరిస్తున్నాయని దాసోజు శ్రవణ్ ఆక్షేపించారు. కేంద్రం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని మండిపడ్డారు. ప్రాంతీయ భాషల్లో చదువుకొనే విద్యార్థులకు గొడ్డలిపెట్టులా మారనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతతత్వ ఎజెండాను అమలు చేసేందుకు కేంద్రం కంకణం కట్టుకున్నదని విమర్శించారు. ఒకే వర్గం భావజాలాన్ని సిలబస్‌లో ప్రవేశపెట్టేందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. యూజీసీ నిబంధనలను నిరసిస్తూ కేంద్రానికి బీఆర్ఎస్ తరపున ఐదు పేజీల లేఖ రాశామని తెలిపారు.

అభిప్రాయాలను పంపించాం

యూజీసీ జారీచేసిన అసంబద్ధమైన నిబంధనలను బీఆర్ఎస్ నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు. ఇప్పటికే అభ్యంతరాలను యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్‌కు పంపించామని తెలిపారు. కేటీఆర్ నేతృత్వంలో త్వరలోనే యూజీసీ చైర్మన్, కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, నితీన్ గడ్కరీని కలుస్తామని చెప్పారు. దాంతో పాటు పెండింగ్‌లో ఉన్న సిద్దిపేట, సిరిసిల్ల, వేములవాడ జాతీయ రహదారిపై చర్చిస్తామని పేర్కొన్నారు.

కేంద్రానికి రేవంత్ వంత:గెల్లు శ్రీనివాస్

యూజీసీ నిబంధనలను అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా సీఎం రేవంత్ మాత్రం మౌనంగా ఉండటం వెనుక అంతర్యమేంటని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. ప్రధాని మోదీ ఫెడరల్ స్ఫూర్తిని మంటగలుపుతున్నా సీఎం మౌనంగా ఉండటాన్ని చూస్తుంటే వంతపాడుతున్న విషయం అర్థమవుతున్నదని పేర్కొన్నారు. ఇదే విషయమై ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం సైతం మౌనం దాల్చడం వెనుక మర్మమేంటని నిలదీశారు. యూజీసీ ముసాయిదాను రాష్ట్రం ఆమోదిస్తే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి తన వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు.

శుక్రవారం సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో సిరిసిల్ల మున్సిపాలిటీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న కేటీఆర్

రుణమాఫీపై సర్కారు తప్పుడు లెక్కలు

- రేవంత్‌కు ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదు
- గాలి మాటలతో కాలం వెళ్లదీస్తున్నరు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రజల్లో తరగని అభిమానం
- రెట్టింపు ఉత్సాహంతో ప్రజల కోసం పనిచేద్దాం
- సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పాలకవర్గాల ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ‘రూ.2 లక్షల రుణమాఫీ పూర్తయ్యిందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పున్న మాటలు శుద్ధ అబద్ధాలే. పూర్తిస్థాయిలో కాలేదని స్వయానా మంత్రి దామోదర రాజనర్సింహా చెప్తున్నరు. ఇకనైనా మోసపు మాటలు బంద్ పెట్టాలి’ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. గుడ్లు పీకుతా, పేగులు మెడలో వేసుకుంటానంటూ డైలాగులు కొట్టిన రేవంత్‌కు ప్రభుత్వాన్ని నడపడం చేత కావట్లేదని ధ్వజమెత్తారు. ‘మాటలు కోటలు దాటుతున్నాయి. చేతలు గడప దాటట్లేదు. పాలన అంటే డైలాగులు చెప్పినంత సులభం కాదు. ప్రభుత్వం నడపడం ఎంత కష్టమో ఆయనకు ఇప్పుడు తెలిసి వచ్చింది’ అని చురకలంటించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు ఎలా పెట్టాలి? ఎవరిని జైల్లో తోయాలన్న కుట్రలు మాని ఆరు గ్యారెంటీలు అమలు చేసి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెట్టాలని హితవు చెప్పారు. మహాలక్ష్మి పథకం ఎందుకు అమలు చెయ్యలేదని నిలదీశారు. కోటి అరవై ఐదు లక్షల మంది ఆడపడుచులు రూ.2,500 పింఛను కోసం ఎదురుచూస్తున్నారని, అందుకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో తీసుకున్న కోటి ఐదు లక్షల దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. తీసుకున్న దరఖాస్తులకు పథకాలు అమలు చెయ్యకుండా మళ్లీ ఎందుకు గ్రామసభలు పెట్టారని నిలదీశారు. ఇచ్చిన దరఖాస్తులకు దిక్కులేదని, జాబితాలో పేరు రాలేదంటే మళ్లీ దరఖాస్తు పెట్టుకోమని చెప్పడం దాటవేయడమేనని ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ పాలకవర్గ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ నెల 26తో పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల చైర్‌పర్సన్లతోపాటు కౌన్సిలర్లందరినీ ఘనంగా సన్మానించి, మాట్లాడారు. మనకు అధికారం పోయింది కానీ, ప్రజల్లో అభిమానం మాత్రం పోలేదని కేటీఆర్ స్పష్టంచేశారు. ఎక్కడికి పోయినా, ఎవరిని కదిలించినా కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేనంటూ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. పోయింది అధికారమే తప్ప పోరాట పటిమ కాదని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ‘గాడిదలుంటేనే గుర్రం విలువ తెలుస్తుంది. చీకటితోనే వెలుగు విలువ తెలుస్తుంది.. కేసీఆర్ ప్రభుత్వం లేని లోటు ప్రజలంతా అర్థం చేసుకుంటున్నారు’ అని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని, సర్కారు చేసిన తప్పిదాలకు అధికారులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

మసకబారుతున్న ఐటీ హబ్‌లు

- కాంగ్రెస్ పాలనలో బిల్లులు కూడా కట్టలేని దుస్థితి
- మా మీది కోపం యువత మీద ఎందుకన్న కేటీఆర్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పుణ్యమా అని రాష్ట్రంలో ఐటీ హబ్‌లు ఒకొక్కటి పట్టాలు తప్పుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కొత్త కంపెనీల రాక దేవుడెరుగు.. ఉన్న కంపెనీలు పోకుండా చూడాలని ఎక్స్ వేదికగా సర్కార్‌కు సూచించారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ద్వితీయశ్రేణి నగరాలకూ ఐటీ రంగాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో 8 ఐటీ హబ్‌లను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఐటీ హబ్‌ల పరిస్థితి బాగ లేదని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యుత్తు, ఇంటర్నెట్ బిల్లులను కూడా కట్టలేని దుస్థితి నెలకొన్నదని తెలిపారు. దీని ప్రభావం కంపెనీలపై పడుతున్నదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మీద కోపంతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు.

అసలు ఏం జరిగిందంటే..

సిద్దిపేట శివారులోని నాగుల బండ వద్ద 63కోట్లతో ఐటీ టవర్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. ఈ టవర్‌తో చాలామంది స్థానిక యువతకు ఉద్యోగాలు లభించాయి. ఈ టవర్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దీంతో కొన్ని కంపెనీలు సేవలను నిలిపివేశాయి. బిల్లు చెల్లించలేదన్న కారణంతో నాలుగు రోజులుగా ఐటీ టవర్‌లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న హరీశ్‌రావు చొరవ తీసుకొని సేవలను పునరుద్ధరించారు.

ప్రపంచాన్ని మార్చే శక్తి బాలికలదే

అమ్మాయికి అవకాశం, అధికారం ఇస్తే ప్రపంచాన్నే మార్చేస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన ఎక్స్‌లో ఓ ఫొటోను పోస్ట్‌చేశారు. రేపటి ప్రపంచాన్ని అద్భుత విజయాల దిశగా తీర్చిదిద్దే శక్తి అమ్మాయిలకే ఉన్నదని, కేటీఆర్ పేర్కొన్నారు.

రాజకీయాలకు ఎంపీ విజయసాయిరెడ్డి గుడ్‌బై

నేడు రాజ్యసభకు రాజీనామా!

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): వైఎస్సార్‌సీపీ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ‘శనివారం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను. ఏ రాజకీయ పార్టీలో చేరడం లేదు. వేరే పదవుల్లో, ప్రయోజనాల్లో లేక డబ్బులో ఆశించి రాజీనామా చేయడం లేదు. ఈ నిర్ణయం పూర్తిగా తన వ్యక్తిగతం. ఎలాంటి ఒత్తిళ్లు లేవు. ఎవరూ ప్రభావితం చెయ్యలేదు. నాలుగు దశాబ్దాలుగా, మూడుతరాలుగా నన్ను నమ్మి ఆదరించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉంటాను. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన జగన్‌కు, నన్ను ఇంతటి స్థాయికి తీసుకెళ్లిన భారతమ్మకు కృతజ్ఞుడిని. జగన్‌కు మంచి జరగాలని కోరుకుంటున్నా. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో పనిచేశా. టీడీపీతో రాజకీయంగా విభేదించా. నా భవిష్యత్తు వ్యవసాయం. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన రాష్ట్ర ప్రజలు, మిత్రులు, సహచరులు, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు’ అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిపాం

అభివృద్ధిలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిపేలా కేసీఆర్ ప్రభుత్వం పాలన సాగించిందని కేటీఆర్ గుర్తుచేశారు. దేశంలో 3% జనాభా ఉన్న తెలంగాణకు 30% అవార్డులు కేంద్రం ఇవ్వడమే నిదర్శనమని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో డంప్ యార్డులు, శ్మశానవాటికలు, పల్లె, పట్టణ ప్రకృతి వనాలు, ఇలా చెప్పుకుంటూ పోతే అనేక కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేసుకుంటూ ముందుకుపోయామని గుర్తుచేశారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు అన్న తేడా లేకుండా పల్లెలను దేశానికి పట్టుగొమ్మల్లా అభివృద్ధి చేసి దేశానికి స్ఫూర్తిగా నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. పదవులు లేవన్న భావన పక్కనపెట్టి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని కౌన్సిలర్లుకు సూచించారు. 2014కు ముందు తెలంగాణ ఎట్లుండె, ఇప్పుడెట్లుందో ప్రజలకు కండ్ల ముందు కనిపిస్తున్నదని చెప్పారు. మన మంటే ప్రజల్లో అభిమానం ఉన్నదని, రెట్టింపు ఉత్సాహంతో వారికి మెరుగైన సేవలందించి ఎక్కువ అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం సిరిసిల్ల జిల్లాకు రూ.నలభై కోట్లు కేటాయించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వదని చెప్పారు. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం వందల కోట్లు ఖర్చుపెట్టిందని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళ, రామతీర్థపు మాధవి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

డీఎంఈగా నరేంద్రకుమార్

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): వైద్య విద్య సంచాలకుడిగా(డీఎంఈ) డాక్టర్ నరేంద్రకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియార్టీ ప్రకారం రెగ్యులర్ డీఎంఈని నియమించాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నది. నరేంద్రకుమార్ ప్రస్తుతం ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. డీఎంఈ(అకడమిక్)గా శివరాంప్రసాద్‌ను నియమించారు. ఆయన జగిత్యాల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం డీఎంఈ పోస్టు ఏపీకి వెళ్లిపోగా.. ప్రభుత్వం తాజాగా డీఎంఈ, డీపీహెచ్, టీవీవీపీ కమిషనర్ పోస్టులను సృష్టించింది. శుక్రవారం వీరు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వైద్యుల సంఘం(టీజీజీడీఏ) వారికి అభినందనలు తెలిపింది.

బీసీలు ధర్మపోరాటానికి సిద్ధం కావాలి : కుమారస్వామి

హైదరాబాద్, జనవరి24 (నమస్తే తెలంగాణ): బీసీలు తమ హక్కుల కోసం ధర్మపోరాటానికి సిద్ధం కావాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు వెంటనే బీసీ కులగణన చేపట్టాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయాలని, ఓబీసీల కేంద్ర జాబితాను గ్రూపుల వారీగా వర్గీకరించాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు నేడు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

17 పుణ్యక్షేత్రాల్లో మద్యం దుకాణాల మూసివేత

మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్

ఖర్గోన్: మధ్యప్రదేశ్‌లోని 17 పుణ్యక్షేత్రాల్లో మద్యం దుకాణాలను మూసివేయాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ శుక్రవారం చెప్పారు. ఖర్గోన్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఒక నగర పాలక సంస్థ, ఆరు పురపాలక సంఘాలు, ఆరు నగర పరిషత్తులు, ఆరు గ్రామ పంచాయతీలలో ఇది అమలవుతుందని, ఉజ్జయిని నగరపాలక సంస్థ పరిధిలో పూర్తిగా మూసివేస్తామని చెప్పారు.

400 ప్లాట్లు కబ్జా చేశారు!

- 20 ఏండ్లుగా పోరాడుతున్నా న్యాయం జరగట్లే
- కబ్జాదారులతో సర్వే అధికారులు కుమ్మక్కయ్యారు
- కబ్జాకు కాంగ్రెస్ ఎంపీ రఘువీర్‌రెడ్డి సహకారం
- ప్లాట్స్ వద్ద నేటి నుంచి నిరాహారదీక్ష చేస్తాం
- అమీన్‌పూర్ చక్రపురి నేతాజీ ప్లాట్ ఓనర్స్ వెల్లడి

ప్రెస్‌మీట్‌లో తమ ప్లాట్లకు సంబంధించిన మ్యాపులు చూపిస్తున్న చక్రపురి నేతాజీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీబ్యూరో/ఖైరతాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్లు 130,135లోని 18ఎకరాలలో ఉన్న తమ 400 ప్లాట్ల కబ్జాకు సర్వే అధికారులు, పోలీసుల సహకారంతో కీర్తి కావేరి ప్రాపర్టీస్ మేనేజింగ్ పార్ట్‌నర్ కృష్ణంరాజు అనే వ్యక్తి యత్నిస్తున్నారని చక్రపురి నేతాజీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. కబ్జాకు నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ రఘువీర్‌రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్లాట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర్‌రావు, ఉపేందర్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. 1986లో కొన్న తమ ప్లాట్లను 2006లో కబ్జా చేశారని, అప్పటినుంచి తాము పోరాటం చేస్తూనే ఉన్నామని తెలిపారు. 2018లో భూముల సర్వే తర్వాత పర్మినెంట్ ల్యాండ్ మార్క్స్ పెట్టి, ట్రైజంక్షన్‌ను ఖరారు చేసిన తర్వాత మళ్లీ కృష్ణంరాజు అనే వ్యక్తి హైకోర్టుకు వెళ్లారని తెలిపారు. సర్వేకు హైకోర్టు ఆదేశించిందని, సర్వే అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. రీసర్వే చేయాలంటూ అధికారులను వేడుకున్నా ఫలితం లేదని, అందుకే నేటి నుంచి నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు చెప్పారు.

కాంగ్రెస్ ఎంపీ అండతోనే!

కబ్జా నుంచి తమ ప్లాట్లను రక్షించుకునేందుకు 20 ఏండ్లుగా పోరాడుతున్నామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఐలాపూర్, అమీన్‌పూర్, బొల్లారం మూడు ఊళ్లకు నిర్ణయించిన ట్రైజంక్షన్‌ను మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ట్రైజంక్షన్, బై జంక్షన్ మొదలైన శాశ్వత గుర్తులను పరిగణనలోకి తీసుకోకుండా సర్వే నిర్వహించిన 18ఎకరాల సరిహద్దు మార్పు పెద్ద కుంభకోణం అని అభివర్ణించారు. ఈ సర్వే సరిహద్దులను మార్చడం వల్ల 400మంది ప్లాట్ల యజమానులపైనే కాకుండా అమీన్‌పూర్ సర్వే నంబర్లపై ప్రభావం ఉంటుందని చెప్పారు.

అమీన్‌పూర్‌లో సర్వేకు హైడ్రా సిద్ధం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో భూముల సర్వేకు సిద్ధమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. పార్కులు, రోడ్డు, ప్లాట్లను గోల్డెన్ కీవెంచర్స్ వారు ఆక్రమించారంటూ వెంకటరమణకాలనీ వాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ కాలనీ, రంగారావు వెంచర్, చక్రపురి కాలనీ వాసులు కూడా ఏమైనా కబ్జాలుంటే నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని రంగనాథ్ సూచించారు.

బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కమల్‌రాజు, కొండబాల

కడచూపునకు అనుమతించని పోలీసులు

- భార్యాపిల్లలు చనిపోయినా కోర్టుకు రిమాండ్ చేసి జైలుకు పంపిన వైనం
- ముగ్గురి అంత్యక్రియలు నిర్వహించిన కుటుంబసభ్యులు
- ఖమ్మం జిల్లా నిధానపురంలో విషాదం

మధిర, జనవరి 24 : ఖమ్మం జిల్లా మధిర మండలం నిధానపురంలో ఓ దొంగతనం కేసులో పోలీసులు షేక్‌బాజీని అరెస్ట్ చేశారు. ఈ కేసులో భార్య, తల్లిదండ్రులు కూడా ఖమ్మం రావాల్సి ఉంటుందని సూచించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన భార్య ప్రేజా తన ఇద్దరు పిల్లలకు ఉరివేసి, తానూ ఉరివేసుకుంది. భార్య, పిల్లలు మృతిచెందినా పోలీసులు మాత్రం కడసారి చూసేందుకు కూడా బాజీకి అవకాశం కల్పించలేదు. రాత్రి సమయంలోనే అతడిని కోర్టుకు రిమాండ్ చేసి జైలుకు పంపించారు. దీంతో శుక్రవారం చాన్‌బీ, షేక్ గపూర్ కోడలు, మనవరాళ్ల అంత్యక్రియలు నిర్వహించారు. మధిర సీఐ మధు, ఎస్సై లక్ష్మీభార్గవి బందోబస్తు నిర్వహించారు. మతాంతర వివాహం చేసుకున్న కూతురు మౌనిక(ప్రేజా) మృతదేహాన్ని చూసి ఆమె తల్లిదండ్రులు లక్ష్మి, భూషణ్ భోరున విలపించారు. మృతదేహాలకు జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న భార్య, పిల్లలను కడసారి చూసేందుకు భర్తకు అవకాశం ఇవ్వకపోవడం దారుణమని మండిపడ్డారు.

ఎలక్ట్రిక్ బస్సుల్లో ‘గ్రీన్‌ట్యాక్స్’ బాదుడు

- రూ.10 నుంచి రూ.20 అదనంగా వసూలు చేస్తున్న ఆర్టీసీ
- టికెట్లపై వివరాలు ముద్రించకపోవడంపై ప్రయాణికుల ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): కాలుష్యాన్ని నియంత్రించి, డీజిల్ భారాన్ని తగ్గించుకోవడం లక్ష్యంగా ఆర్టీసీ ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు భారంగా మారుతున్నాయి. పర్యావరణహిత ప్రయాణం పేరుతో ఆర్టీసీ ‘గ్రీన్ ట్యాక్స్’ పేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నది. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.10, ఏసీ బస్సుల్లో రూ.20 వసూలు చేస్తున్నది. అదనపు వసూళ్ల సమాచారం టికెట్‌పై ముద్రించకపోవడంతో ప్రయాణికులు, సిబ్బంది మధ్య తరచుగా గొవడలు జరుగుతున్నాయి. ఇప్పటికే సూపర్ లగ్జరీ బస్సుల్లో వాటర్ బాటిల్ పేరుతో రూ.10 వసూలు చేస్తున్నారు. ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది.. అడిగితేనే వాటర్ బాటిల్ ఇస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో టికెట్‌పై చార్జీలతో పాటు టోల్, సెస్ వివరాలను ఆర్టీసీ ముద్రించేది. కానీ ఇటీవల వాటిని తొలగించింది. దీంతో ఆర్టీసీ అధికారులు ఎప్పుడు ఎందుకు చార్జీలు పెంచుతున్నారో తెలియక ప్రయాణికులు గందగోళానికి గురవుతున్నారు.

కూల్‌గా ఆర్టీసీ వసూల్

రాష్ట్ర వ్యాప్తంగా సిటీలకు 170, జిల్లా కేంద్రాలకు 183 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ నడుపుతున్నది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆరు డిపోలతోపాటు వరంగల్-2, కరీంనగర్-2, నిజామాబాద్-2 డిపోల్లో కూడా ఎలక్ట్రికల్ బస్సులను నడుపుతున్నది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఒలెక్ట్రా, ఢిల్లీకి చెందిన జేబీఎం సంస్థ నుంచి గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) పద్ధతిలో ఆర్టీసీ అద్దెకు తీసుకున్నది. జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్ రూట్లలో వీటిని ఎక్కువగా తిప్పుతున్నది. దీంతో ఇప్పటి వరకు ఈ రూట్లలోని డీజిల్ బస్సులను తగ్గించింది. ప్రయాణికులు వీటిలోనే ప్రయాణించాల్సిన అనివార్యత కల్పించింది. రాష్ట్రంలో ప్రతీ రోజు లక్ష మందికి పైగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది మహిళలు ఉన్నారు. జిల్లాల నుంచి ఎలక్ట్రికల్ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు లేకపోవడంతో ఉచిత ప్రయాణం వర్తించడం లేదు కాబట్టి తప్పనిసరిగా టికెట్ తీసుకుంటున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగమైన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మెల్లగా తొలగించేందుకే ఈ ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా వరంగల్ నుంచి హైదరాబాద్ ఆర్డినరీ బస్సుల్లో రూ. 150, ఎక్స్‌ప